




RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్
వార్తా పత్రిక








నల్లగొండ | epaper.news war.com | గురువారం 3 సెప్టెంబర్ 2026 | సంపుటి :16 సంచిక :143 | ఎడిటర్: కృష్ణారావు నటవ | పేజీలు : 4 , వెల.2.00




### దిశా సాలియన్ మృతి కేసు.. సీబీఐ

## దర్యాప్తునకు బాంబే హైకోర్టు ఆదేశం..

దివంగత బాలీవుడ్ స్టార్ హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా సాలియన్ మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బాంబే హైకోర్టు సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. దిశపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేశారని ఆరోపిస్తూ ఆమె తండ్రి సతీష్ సాలియన్ గత సంవత్సరం బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఆ పిటిషన్‌పై జస్టిస్ సారంగ్ కోట్వాల్, జస్టిస్ రంజీత్‌సిన్హా రాజా భోసలేలతో కూడిన ధర్మాసనం ఆగస్టు 28వ తేదీన విచారణను ముగించి, తీర్పును రిజర్వ్ చేసింది.

2



### తమిళనాట ప్రముఖ ఆలయాల్లో

## సెల్‌ఫోన్లపై నిషేధం..

తమిళనాడులోని దేవాలయాల్లో రీల్స్ చిత్రీకరించే యువతకు బుద్ధి చెప్పేందుకు విజయ్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 52 ప్రధాన దేవాలయాలలో స్మార్ట్‌ఫోన్ల వినియోగంపై టీవీకే ప్రభుత్వం పూర్తి స్థాయి నిషేధాన్ని విధించింది. ఈ కొత్త నిబంధనలు సెప్టెంబర్ 1, 2026 (మంగళవారం) నుంచే అమలులోకి వచ్చాయి. మద్రాస్ హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు హిందూ ధార్మిక, ధర్మాదాయ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.హిందూ ధార్మిక, ధర్మాదాయ శాఖ మంత్రి రమేష్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఆలయాలలో కొంతమంది భక్తులు, ముఖ్యంగా యువత సామాజిక మాధ్యమాల కోసం రీల్స్ చేస్తున్నారు.

2



### 'జీవితం పరుగుపందెం కాదు'..

## ఐఐటీ గువాహటి విద్యార్థులకు సీఎం కీలక సందేశం

ఐఐటీ గువాహటికి చెందిన 100 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించాలని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను, ఐఐటీ గువాహటి డైరెక్టర్‌ను ఆయన ఆదేశించారు.



# రక్షణ ఎక్స్‌పో - 2026

### డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు సదస్సు

### స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలి

### డిఫెన్స్ ఎక్స్‌పో ప్రారంభానికి రాజ్‌నాథ్‌ను ఆహ్వానించిన సీఎం రేవంత్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో - 2026ను ప్రారంభించాలని రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం రక్షణ శాఖ మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వీరు చర్చించారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సుతో పాటు ప్రతిష్టాత్మక ఎయిర్ షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం పేర్కొన్నారు.



వార్త 2లో

### రాజీనామా కోరలేదు..

## అధిష్ఠానం నిర్ణయం కోసం వేచి చూస్తున్నా



2

కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపురావడంతో ఢిల్లీకి వెళ్లిన మంత్రి కొండా సురేఖ.. పలువురు పార్టీ పెద్దలతో భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా ఈరోజు(బుధవారం) ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సురేఖ మాట్లాడుతూ.. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశానని.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఇంకా మాట్లాడలేదని అన్నారు.



2

## మేడ్చల్‌లో నకిలీ వైద్యుల గుట్టురట్టు.. ఐదుగురి అరెస్టు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నకిలీ వైద్యుల వ్యవహారం తీవ్ర కలకలం రేపింది. ఎలాంటి వైద్య డిగ్రీలు.. అర్హతలు లేకుండానే కొందరు వ్యక్తులు క్లినిక్‌లు ఏర్పాటు చేసుకుని ప్రజలకు వైద్యం చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది.

### 22ఎ భూములపై అసెంబ్లీలో

## ఏం మాట్లాడతారో రండి..

### బీఆర్ఎస్‌కి పొంగులేటి సవాల్



2

22ఎ భూములపై అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్ నేతలు సభలో ఏం మాట్లాడతారో మాట్లాడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ చేశారు. 22ఏ భూములను అడ్డుపెట్టుకుని దందాలు చేస్తామంటే కుదరదని హెచ్చరించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రతిపక్ష పాత్రను విస్మరించాయని ధ్వజమెత్తారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వెయ్యి రోజులు పూర్తి చేసుకుందని తెలిపారు. కేసీఆర్ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని ధ్వజమెత్తారు.

### కాళేశ్వరంలో కుట్ర జరిగితే అప్పుడెందుకు

## కేసు పెట్టలేదు: కడియం శ్రీహరి

2

బీఆర్ఎస్ నాయకులు అక్కసుతో, అహంకారంతో మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే కల్వకుంట్ల కుటుంబానికి మాత్రమే ఉపయోగపడిందని ఆరోపించారు. ఈరోజు (బుధవారం) లింగాల గణపురంలో కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని మాట్లాడారు. బీజేపీ నేతలు సర్వేల్లో, పోటీల్లో వెనుకబడుతున్నారని రెచ్చిపోయి ఏది పడితే అది మాట్లాడుతున్నారని విమర్శించారు.



### హైదరాబాద్‌లో నకిలీ కరెన్సీ

## ముఠా గుట్టురట్టు

హైదరాబాద్,

నగరంలోని శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నకిలీ కరెన్సీ తయారీ.. చలామణికి పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు నకిలీ నోట్లను తయారు చేసి వాటిని మార్కెట్‌లో చలామణి చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో ప్రత్యేకంగా నిఘా పెట్టిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి మొత్తం రూ.2.90 లక్షల విలువైన నకిలీ కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా నకిలీ నోట్ల తయారీకి ఉపయోగిస్తున్న పరికరాలు, వివిధ రకాల సామగ్రిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో నకిలీ కరెన్సీ చలామణిపై పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. సాధారణ ప్రజలను మోసం చేస్తూ నకిలీ నోట్లను చలామణిలోకి తీసుకువచ్చే ప్రయత్నాలను అడ్డుకునేందుకు పోలీసులు చేపట్టిన చర్యల్లో భాగంగా ఈ ముఠా పట్టుబడినట్లు తెలుస్తోంది.

# దిశా సాలియన్ మృతి కేసు.. సీబీఐ దర్యాప్తునకు బాంబే హైకోర్టు ఆదేశం..

ఇంటర్‌నెట్ డెస్క్:

దివంగత బాలీవుడ్ స్టార్ హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా సాలియన్ మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బాంబే హైకోర్టు సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. దిశపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేశారని ఆరోపిస్తూ ఆమె తండ్రి సతీష్ సాలియన్ గత సంవత్సరం బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఆ పిటిషన్‌పై జస్టిస్ సారంగ్ కోట్వాల్, జస్టిస్ రంజీత్‌సిన్హా రాజా భోసలేలతో కూడిన ధర్మాసనం ఆగస్టు 28వ తేదీన విచారణను ముగించి, తీర్పును రిజర్వ్ చేసింది. సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తూ బుధవారం తీర్పును వెలువరించింది. సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, సతీష్ సాలియన్ స్టేట్‌మెంట్ రికార్డు చేయాలని ఆదేశించింది. దర్యాప్తు సంస్థకి తగిన ఆధారాలు లభించే వరకు ఎవరినీ నేరస్తులుగా పరిగణించరాదని హైకోర్టు స్పష్టం చేసింది.

# తమిళనాట ప్రముఖ ఆలయాల్లో సెల్‌ఫోన్లపై నిషేధం..

చెన్నై,

తమిళనాడులోని దేవాలయాల్లో రీల్స్ చిత్రీకరించే యువతకు బుద్ధి చెప్పేందుకు విజయ్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 52 ప్రధాన దేవాలయాలలో స్మార్ట్‌ఫోన్ల వినియోగంపై టీవీకే ప్రభుత్వం పూర్తి స్థాయి నిషేధాన్ని విధించింది. ఈ కొత్త నిబంధనలు సెప్టెంబర్ 1, 2026 (మంగళవారం) నుంచే అమలులోకి వచ్చాయి. మద్రాస్ హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు హిందూ ధార్మిక, ధర్మాదాయ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.హిందూ ధార్మిక, ధర్మాదాయ శాఖ మంత్రి రమేష్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఆలయాలలో కొంతమంది భక్తులు, ముఖ్యంగా యువత సామాజిక మాధ్యమాల కోసం రీల్స్ చేస్తున్నారు. అలా వీడియోలు తీయడం వల్ల ఆలయ పవిత్రత దెబ్బతింటోంది. ఇతర భక్తుల ప్రశాంతతకు భంగం కలుగుతోంది. అందుకే ఈ చర్యలు చేపట్టాము' అని తెలిపారు.

### సెల్‌ఫోన్ల కోసం ప్రత్యేక కౌంటర్లు..

భక్తులు తమ స్మార్ట్‌ఫోన్లను ఆలయ ప్రవేశ ద్వారాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో భద్రపరచాల్సి ఉంటుంది. ఇందుకోసం ఫోన్‌కు 5 రూపాయల చొప్పున డిపాజిట్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. అయితే, కెమెరాలేని కీప్యాడ్ మొబైల్ ఫోన్లను ఆలయంలోనికి తీసుకెళ్లడానికి అనుమతి ఉంది.

# 'జీవితం పరుగుపందెం కాదు'.. ఐఐటీ గువాహటి విద్యార్థులకు సీఎం కీలక సందేశం

ఇంటర్నెట్ డెస్క్:

ఐఐటీ గువాహటికి చెందిన 100 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించాలని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను, ఐఐటీ గువాహటి డైరెక్టర్‌ను ఆయన ఆదేశించారు. సెప్టెంబరు 1న జరిగిన ఐఐటీ గువాహటి 33వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐఐటీ గువాహటి కేవలం విద్యలో ప్రతిభ చూపించే సంస్థ కాదని.. అస్సాం, ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతీకగా నిలుస్తోందని అన్నారు.ఐఐటీ గువాహటి విద్యార్థుల కోసం అస్సాం ప్రభుత్వం 100 స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నట్లు సీఎం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని త్వరగా అమలు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సంబంధిత అధికారులను, ఐఐటీ గువాహటి డైరెక్టర్‌ను కోరారు. అస్సాం ఎదుర్కొనే సంక్లిష్టమైన సాంకేతిక, అభివృద్ధి సమస్యలకు పరిష్కారాలు కనుగొనడంలో ఐఐటీ గువాహటి కీలక పాత్ర పోషిస్తుందని హిమంత బిశ్వ శర్మ ఆశాభావం వ్యక్తం చేశారు.

### 'జీవితం పరుగుపందెం కాదు'

ఈ సందర్భంగానే ఐఐటీ గువాహటి విద్యార్థులకు సీఎం ప్రత్యేక సందేశాన్ని కూడా ఇచ్చారు. 'జీవితం పరుగుపందెం కాదు.. మీరు అందరికంటే వేగంగా ముందుకు వెళ్లకపోయినా పర్వాలేదు. దానివల్ల మీరు వెనుకబడినట్లు భావించాల్సిన అవసరం లేదు' అని సీఎం హిమంత బిశ్వ శర్మ సూచించారు.

# రాజీనామా కోరలేదు.. అధిష్ఠానం నిర్ణయం కోసం వేచి చూస్తున్నా: కొండా సురేఖ

హైదరాబాద్,

కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపురావడంతో ఢిల్లీకి వెళ్లిన మంత్రి కొండా సురేఖ.. పలువురు పార్టీ పెద్దలతో భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా ఈరోజు(బుధవారం) ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సురేఖ మాట్లాడుతూ.. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశానని.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఇంకా మాట్లాడలేదని అన్నారు. అధిష్ఠానం ఏం చేస్తుందో వేచిచూస్తున్నట్లు తెలిపారు. రాజీనామా చేయాలని తనను కోరలేదని చెప్పారు.బీసీ అయిన తనకు ఒక న్యాయం.. ఇతర సామాజికవర్గాలకు మరో న్యాయం పాటిస్తారా అని కొండా సురేఖ ప్రశ్నించారు. కేబినెట్‌లో ఉన్న ఇతర సామాజికవర్గాల నేతలపై పెద్దఎత్తున అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. వాటన్నింటికీ ఏం సమాధానం చెబుతారని.. ఎలాంటి చర్యలు తీసుకుంటారని అడిగారు. అన్ని అంశాలపై ఇప్పటికే ఖర్గే, రాహుల్, ప్రియాంక సహా అధిష్ఠాన పెద్దలందరికీ రాతపూర్వకంగా తెలియజేసినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌పై అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదేళ్లు తానే సీఎం అని రేవంత్ ఎలా చెబుతారని ప్రశ్నించారు. అన్ని విషయాలనూ పరిగణనలోకి తీసుకోవాలని ఖర్గేకు చెప్పినట్లు మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

# రక్షణ ఎక్స్‌పో - 2026

## డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు సదస్సు

## స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలి

## డిఫెన్స్ ఎక్స్‌పో ప్రారంభానికి రాజ్‌నాథ్‌ను ఆహ్వానించిన సీఎం రేవంత్



ఢిల్లీ, న్యూస్‌వార్ ప్రతినిధి

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో – 2026ను ప్రారంభించాలని రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం రక్షణ శాఖ మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వీరు చర్చించారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సుతో పాటు ప్రతిష్టాత్మక ఎయిర్ షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.దేశవ్యాప్తంగా రక్షణ రంగంలోని పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే రక్షణ ఎక్స్‌పోకు హాజరై మార్గనిర్దేశం చేస్తే, వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో – 2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని అన్నారు. రక్షణ ఎక్స్‌పో–2026ను అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని రాజ్‌నాథ్ సింగ్‌కు తెలంగాణ సీఎం విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ఈ ప్రదర్శనలో పాల్గొనేలా సహకరించాలని ఆయనను కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని సీఎం రేవంత్ కోరారు. హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ తదితర రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు, డీఆర్‌డీవో ప్రయోగశాలలు రక్షణ ఎక్స్‌పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. విదేశీ రక్షణ శాఖ ప్రతినిధులు, ద్వైపాక్షిక రక్షణ ప్రతినిధి బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రముఖులతో సమావేశాలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాలు భూసేకరణ చేపట్టిందని రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. రక్షణ శాఖ మొత్తం1,500 ఎకరాలు కోరిందని.. మరో 750 ఎకరాలు సేకరించి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారు.మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఇప్పటికే టీజీఐఐసీ అంగీకరించిందని రక్షణ శాఖ మంత్రికి రేవంత్ రెడ్డి వివరించారు. ఎకరానికి కాకుండా మొత్తం భూమికి సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాలకు ఈ భూమిని కేటాయించనున్నట్లు వివరించారు. అవసరమైతే దానిని మరో రెండుసార్లు లీజు పొడిగించుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ సమావేశంలో మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం. అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్) హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు.

# 22ఏ భూములపై అసెంబ్లీలో ఏం మాట్లాడతారో రండి..

## బీఆర్ఎస్‌కి పొంగులేటి సవాల్

హైదరాబాద్,

22ఏ భూములపై అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్ నేతలు సభలో ఏం మాట్లాడతారో మాట్లాడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ చేశారు. 22ఏ భూములను అడ్డుపెట్టుకుని దందాలు చేస్తామంటే కుదరదని హెచ్చరించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రతిపక్ష పాత్రను విస్మరించాయని ధ్వజమెత్తారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వెయ్యి రోజులు పూర్తి చేసుకుందని తెలిపారు. కేసీఆర్ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని ధ్వజమెత్తారు. ఈరోజు (బుధవారం) హైదరాబాద్‌లో మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చిట్‌చాట్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, పెట్టిన బకాయిలు తాము చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు. యాస, భాషలతో ప్రజలను మభ్య పెట్టలేరని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ బకాయిలను తామే చెల్లించామని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో సర్పంచ్‌లకు పెట్టిన బకాయి లను కూడా తామే చెల్లించామని పేర్కొన్నారు.

### వరికి క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చాం..

'మా పాలనలోని వెయ్యి రోజుల్లో రూ.1.76లక్షల కోట్లను రైతులకు ఇచ్చాం. ఆనాడు వరి వేస్తే ఉరి అని కేసీఆర్ అన్నారు.. మేము వరికి క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చాం. ప్రజలను కావాలని మా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు రెచ్చగొడుతున్నారు. ఉప ఎన్నికల్లో ఓడినా బీఆర్ఎస్‌కు జ్ఞానోదయం కాలేదు. లోక్‌సభ ఎన్నికల్లో గుండు సున్నా వచ్చినా గులాబీ పార్టీకి జ్ఞానం రాలేదు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓడించాం. అయినా వారిలో మార్పు రాలేదు. ఆనాడు బతుకమ్మ చీరల్లో అవినీతికి పాల్పడ్డారు. రాహుల్ గాంధీని విమర్శస్తావా కేటీఆర్..?. సంస్కార హీనంగా మాట్లాడితే ప్రజలు క్షమించరు. అధికారంలోకి వస్తామని మీరు కలలు కంటూనే ఉండండి. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను మేము నిర్మిస్తున్నాం. హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాం. టీమ్స్‌పై బీఆర్ఎస్ నిస్సిగ్గుగా మాట్లాడుతోంది. నిరసన తెలిపేందుకు అవకాశం లేకుండా ధర్నాచౌక్ ఎత్తేసిన మీరా.. స్వేచ్ఛ గురించి మాట్లాడేది. కేటీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారు' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహించారు.

### కొత్తగా మూడు లక్షల పెన్షన్లు ఇస్తాం..

'మీ 3,475 రోజుల పాలన కంటే, మా వెయ్యి రోజుల పాలనే బాగుందని ప్రజలు చెబుతున్నారు. మీరు పేదలకు ఇళ్లు ఇచ్చారా?, రేషన్ కార్డులు ఇచ్చారా?. కొత్తగా మరో మూడు లక్షల పెన్షన్లు ఇవ్వబోతున్నాం. ఖమ్మంలో పోడు భూముల సమస్య పరిష్కరిస్తానని కేసీఆర్ అన్నారు. భద్రాచలం రాములోరి గుడికి రూ.1000 కోట్లు ఇస్తానని దేవుడినే మోసం చేశారు. మా మేనిఫెస్టోలో పెట్టినవన్నీ మేము ఇంకా పూర్తి చేయలేదు. ఒక్కొక్కటిగా హామీలను అమలు చేస్తాం. కోర్ ప్రాంతంలో మేము డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టిస్తున్నాం. విలువైన భూములను పేదలకు ఎలా ఇస్తారని బీఆర్ఎస్ నేతలు అడ్డుకునే కుట్రలు చేస్తున్నారు. మీరు ఆర్టీసీ ఎక్స్ రోడ్డు నుంచి అసెంబ్లీ వరకు పొర్లు దండాలు పెట్టినా మేము పేదలకు ఇళ్లు కట్టించి తీరుతాం. నేను వాస్తవాలు చెబితే మీరు తల ఎక్కడ పెట్టుకుంటారో చూద్దాం. ధరణితో మీరు కొల్లగొట్టిన భూములపై విచారణ జరుగుతోంది. మీరు ఏం వ్యాపారం చేశారని.. వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి..?. మీ బండారం శకుని మామ కూతురు దగ్గర ఉంది. ముందు దానికి సమాధానం చెప్పండి' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ చేశారు.

### మీ కుటుంబానికి వేల కోట్లు ఎలా వచ్చాయి..?

'సొంత ఆడబిడ్డకు న్యాయం చేయని మీరు పేద ఆడపడుచులకు న్యాయం చేస్తారా?. ఎంతమంది దళితులకు భూములు ఇచ్చారు, దళిత బంధు ఎంతమందికి ఇచ్చారు. మీ కుటుంబానికి వేల కోట్లు ఎలా వచ్చాయి.?. ఈ రాష్ట్రాన్ని కొల్లగొడితే మీకు వచ్చిన డబ్బులు కావా?. దేశంలోనే రిచెస్ట్ ధనిక పార్టీ ఎలా అయింది. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ తన పాత్ర పోషించకపోవడం దురదృష్టం. ముసుగు తీసి బయటకొస్తే గులకరాళ్లతో కొడతారని భయమా..?. ప్రజల ఇబ్బందులపై మంచి సూచనలు ఇవ్వొచ్చు కదా?. కేసీఆర్ ప్రధాన ప్రతిపక్ష హోదాకు అనర్హులు. మీరు బీజేపీతో జత కట్టారని కవిత చెప్పింది నిజమే అనిపిస్తోంది. ముందు మీ ఇళ్లు చక్కపెట్టుకోండి. ఉస్మానియా యూనివర్సిటీకి మేము చేస్తామన్నది కచ్చితంగా చేస్తాం' అని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

# కాళేశ్వరంలో కుట్ర జరిగితే అప్పుడెందుకు కేసు పెట్టలేదు: కడియం శ్రీహరి

జనగామ,

బీఆర్ఎస్ నాయకులు అక్కసుతో, అహంకారంతో మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే కల్వకుంట్ల కుటుంబానికి మాత్రమే ఉపయోగపడిందని ఆరోపించారు. ఈరోజు (బుధవారం) లింగాల గణపురంలో కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని మాట్లాడారు. బీజేపీ నేతలు సర్వేల్లో, పోటీల్లో వెనుకబడుతున్నారని రెచ్చిపోయి ఏది పడితే అది మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోని పదేళ్లు తెలంగాణ మీద పడి లక్షల కోట్లు దోచుకున్నారని.. స్వయంగా కేసీఆర్ కూతురు కవిత చెప్పిందని ప్రస్తావించారు.

### కవిత లేవనెత్తిన అంశాలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాలి..

దోచుకున్న సొత్తును లెక్కపెట్టేందుకు వారికి సమయం సరిపోవడం లేదని కవిత చెప్పారని కడియం శ్రీహరి అన్నారు. ఎక్కడో పంపకాల్లో తేడా రావడంతో ఇప్పుడు ఆమె బయటకు వచ్చి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నాయకులకు సిగ్గు ఉంటే తమ మీద విమర్శలు, వ్యతిరేకంగా నిరసనలు చేయడం కాదని.. కవిత లేవనెత్తిన అంశాలకు సమాధానం చెప్పాలని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరంలోని ప్రధాన మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు అప్పుడే కుంగిపోయాయని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కుట్ర జరిగిందనే అనుమానం ఉంటే అప్పుడెందుకు కేసు పెట్టలేదని ప్రశ్నించారు.

### ప్రభుత్వ సొమ్మును కేసీఆర్ దుర్వినియోగం చేశారు..

కాళేశ్వరం నుంచి చుక్క నీటిని ఉపయోగించకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో అత్యధిక పంట దిగుబడి సాధించిందని కడియం శ్రీహరి తెలిపారు. కేసీఆర్ అధికారాన్ని అడ్డం పెట్టుకొని విచ్చలవిడిగా ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారని ధ్వజమెత్తారు. పదేళ్లలో కల్వకుంట్ల కుటుంబం మాత్రమే బంగారు కుటుంబం అయ్యిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో ఎక్కడా కూడా తెలంగాణ ప్రజలు బాగుపడలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం ఎన్ని నిధులు ఇచ్చిందో బీజేపీ నాయకులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలని కడియం శ్రీహరి ప్రశ్నించారు.

# మేడ్చల్‌లో నకిలీ వైద్యుల గుట్టురట్టు.. ఐదుగురి అరెస్టు

మేడ్చల్,

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో నకిలీ వైద్యుల వ్యవహారం తీవ్ర కలకలం రేపింది. ఎలాంటి వైద్య డిగ్రీలు.. అర్హతలు లేకుండానే కొందరు వ్యక్తులు క్లినిక్‌లు ఏర్పాటు చేసుకుని ప్రజలకు వైద్యం చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ సమాచారంతో కుత్బుల్లాపూర్ ఎస్ఓటీ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి పలు ప్రాంతాల్లో తనిఖీలు.. దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్న ఐదుగురు నకిలీ వైద్యులను అదుపులోకి తీసుకున్నారు. మేడ్చల్ పరిధిలో ఇద్దరు, జగద్గిరిగుట్ట, పెట్ బషీరాబాద్, సూరారం పరిధిలో ఒక్కొక్కరిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఎలాంటి అర్హతలు లేకుండా అల్లోపతి మందులు విక్రయించడంతో పాటు రోగులకు వైద్యం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

### భారీగా మందులు, వైద్య పరికరాలు స్వాధీనం..

నిందితుల వద్ద నిర్వహించిన తనిఖీల్లో భారీగా మందులు, వైద్య పరికరాలు, ఇతర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ అనుమతి లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ముఖ్యంగా వైద్య అర్హతలు లేని వ్యక్తులు అల్లోపతి వైద్యం చేయడం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

న్యూస్ వార్ వార్తా పత్రిక


# పెన్షన్లతో ఆర్థిక భరోసా

సంపాదకీయం...

## లయ తప్పిన హిమాలయం

**నేపాల్‌లో సంభవించిన విపత్తు, ఎగువ అసోంలో ఎన్నడూ లేనంత స్థాయిలో వచ్చిన వరదలు.. అభివృద్ధి, పర్యావరణ పరిమితులు, విపత్తులను ఎదుర్కొనే సన్నద్ధత మధ్య ఉన్న ప్రమాదకరమైన అంతరాన్ని స్పష్టంగా బయటపెడుతున్నాయి. ఆగస్టు 26న హిమాలయ ప్రాంతంలో హిమానీనదం కూలిపోవడం, భారీ ఆకస్మిక వరదల కారణంగా నేపాల్‌ను కుదిపేసిన ఈ ఘోర విపత్తును కేవలం ఓ సుదూర పర్వత దేశం లో జరిగిన మరో విషాద ఘటనగా చూడకూడదు. ఇది మొత్తం హిమాలయ పర్వతశ్రేణికి, ముఖ్యంగా అసోం, బ్రహ్మపుత్ర లోయకు వచ్చిన హెచ్చరికగా పరిగణించాలి. నేపాల్, దానికి ఆనుకుని ఉన్న టిబెట్ ప్రాంతాల్లో రాళ్లు, మంచు, బురద, నీటితో కూడిన వరద ప్రవాహాలు జనావాసాలు, మౌలిక వసతులను ముంచెత్తడంతో కనీసం 800 మంది మరణించినట్లు, దాదాపు 1,000 మంది ఆచూకీ లేకుండా పోయినట్లు సమాచారం. హిమపాతం కారణంగా ఏర్పడిన బురద ప్రవాహం, హిమానీనదాల్లో అస్థిరత ఈ విపత్తుకు కారణాలుగా భావిస్తున్నారు. దీనికి తోడు వాతావరణ మార్పులు హిమాలయ పర్యావరణాన్ని మరింత బలహీనంగా మార్చుతున్నాయి. ఈ హెచ్చరికను ఈ ఏడాది ఎగువ అసోంను ముంచెత్తిన అసాధారణ వరదలతో కలిపి చూసినప్పుడు పరిస్థితి మరింత తీవ్రంగా కనిపిస్తుంది. తరతరాలుగా అసోం వరదలను ఎదుర్కొంటూనే ఉంది. బ్రహ్మపుత్ర, దాని ఉపనదుల సహజ ప్రవాహ చక్రంలో వరదలు ఒక భాగమే. అయితే 2026 జులై-, ఆగస్టులో ఎగువ అసోంను ముంచెత్తిన విపత్తు మాత్రం భిన్నమైనది. శివసాగర్, చరైడియో, జోర్హాట్, చుట్టుపక్కల ప్రాంతాలు.. దశాబ్దాలుగా ఇంతటి తీవ్రతతో వరదలను చూడని ప్రాంతాలు ఒక్కసారిగా నీట మునిగాయి. వరదలు సహజమే.**

కానీ విపత్తు ఎప్పుడూ సహజమైనది కాదు. హిమానీనదాలు క్రమంగా కరిగిపోతున్న కొద్దీ హిమ సరస్సుల పరిమాణం పెరగవచ్చు. వాటిని అడ్డుకునే మొరైన్ కట్టలు అస్థిరంగా మారే అవకాశం ఉంటుంది. కొండచరియలు విరిగిపడటం, మంచుచరియలు విరుచుకుపడటంవల్ల భారీ పరిమాణంలో నీరు ఒక్కసారిగా కిందికి దూసుకురావచ్చు. జిఎల్ఒఎఫ్‌లు (గ్లేషియల్ లేక్ ఔట్‌బర్ట్ ఫ్లడ్స్) అంటే హిమసరస్సుల కట్టలు తెగిపోవడం వల్ల సంభవించే ఆకస్మిక వరదలు. ఇవి అత్యంత వేగంగా దిగువ ప్రాంతాలకు చేరుకుని జనావాసాలు, మౌలిక వసతులను ధ్వంసం చేయగలవు. దిగువ ప్రాంతాల్లో చేపట్టే ప్రణాళికల్లో ఇలాంటి ప్రమాదాలను కూడా తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని ఐసిఐఎంఒడి (ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటెన్ డెవలప్‌మెంట్) ప్రత్యేకంగా హెచ్చరిస్తోంది. ఈ హెచ్చరిక మానవ జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపగలదో నేపాల్ తాజాగా ప్రత్యక్షంగా చూపించింది. ఇది అసోం ముందు నిలిచే అత్యంత అసౌకర్యకరమైన ప్రశ్నకు మనల్ని తీసుకెళ్తోంది: హిమాలయాలు, హిమాలయాల దిగువ ప్రాంతాల్లో జలవిద్యుత్ ప్రాజెక్టుల విస్తరణ. అరుణాచల్‌ప్రదేశ్‌కు అపారమైన జలవిద్యుత్ సామర్థ్యం ఉంది. ఈ సామర్థ్యాన్ని వినియోగించాలన్న వాదన అర్థం చేసుకోదగినదే. భారత్‌కు విద్యుత్, పునరుత్పాదక ఇంధనం, వ్యూహాత్మక మౌలిక వసతులు అవసరం. అయితే పునరుత్పాదక ఇంధనమంటే ప్రమాదాలు ఉండవని కాదు. 2025లో అసోం కార్యకర్తలు సుబన్‌సిరి ప్రాజెక్టును మరోసారి 'పేలేందుకు సిద్ధంగా ఉన్న నీటి బాంబు' గా అభివర్ణిస్తూ, ప్రాజెక్టు ముందుకు సాగించే ముందు భద్రతకు సంబంధించిన సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇది ప్రజల్లో నెలకొన్న తీవ్ర భయాందోళనలకు అద్దంపడుతోంది. మరోవైపు కొత్త ప్రాజెక్టులు మాత్రం ముందుకు సాగుతున్నాయి. ఒకే నదీ పరీవాహక ప్రాంతంలో పది, ఇరవై, ముప్పై ప్రాజెక్టులు నిర్మిస్తే.. మొత్తం పరీవాహక ప్రాంతాన్నీ ఇంజినీరింగ్ చేసిన తర్వాత ఆ నదికి ఏమవుతుంది? అన్న ప్రశ్న తలెత్తుతుంది. అసోం ఎన్నో ఏళ్లుగా ఇదే ప్రశ్నను లేవనెత్తుతోంది. దీనికి శాస్త్రీయ సమాధానం లభించాల్సిన అవసరం ఉంది. విద్యుత్‌ను ఎవరు పొందుతున్నారు? ఆ విద్యుత్ కోసం ముప్పును ఎవరు భరిస్తున్నారు? హిమాలయ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన రాజకీయ, ఆర్థిక కోణం కూడా మరో అసౌకర్యకరమైన అంశాన్ని ముందుకుతెస్తోంది. భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు కాంట్రాక్టులు, నిర్మాణ కార్యకలాపాలు, కన్సల్టెన్సీ ఫీజులు, భూలావాదేవీలు, రాజకీయ ప్రాధాన్యం, వాణిజ్య అవకాశాలను సృష్టిస్తాయి. అయితే వీటి ఆర్థిక ప్రయోజనాలు ప్రభుత్వాలు, కంపెనీలు, కాంట్రాక్టర్ల వంటి వర్గాల మధ్య కేంద్రీకృతమయ్యే అవకాశం ఉండగా.. పర్యావరణపరమైన నష్టాలు మాత్రం దిగువ ప్రాంతాల్లో నివసించే కోట్లాది ప్రజలపై పడతాయి. ఈ అసమతౌల్యాన్ని విస్మరించలేం. అయితే నిర్దిష్ట విపత్తు వల్ల ఏదైనా రాజకీయ నాయకుడు లేదా కంపెనీ వ్యక్తిగతంగా లాభపడిందని ప్రాజెక్టుకు సంబంధించిన ఆధారాలు లేకుండా ఆరోపించడం బాధ్యతారాహిత్యమే. కానీ హిమాలయ మౌలిక వసతుల అభివృద్ధి చుట్టూ ఉన్న రాజకీయ, వాణిజ్య ప్రోత్సాహకాలు.. దిగువ ప్రాంతాల ప్రజలను రక్షించాలన్న ప్రోత్సాహకాల కంటే బలంగా ఉన్నాయా? అని ప్రశ్నించడం మాత్రం పూర్తిగా సమంజసం. ఒక ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో వేల కోట్ల రూపాయల ఆర్థిక విలువను సృష్టించి.. దిగువ ప్రాంతాల్లోని లక్షలాది మంది ప్రజలను ప్రమాదాలకు గురిచేస్తే.. ఆ బాధ్యత ఎవరిది? అన్నది కీలకమైన ప్రశ్న. 'పర్యావరణ అనుమతి తీసుకున్న తర్వాతే ప్రాజెక్టుకు ఆమోదం లభించింది' అనే సమాధానాన్ని అసోం ప్రజలు అంగీకరించాల్సిందేనని చెప్పలేం. ఎందుకంటే పర్యావరణ అనుమతి అనేది నిరంతర పర్యావరణ పర్యవేక్షణకు ప్రత్యామ్నాయం కాదు. మరిన్ని కనుగొనండి ౫ఖఅస్త్రఋస్త్రవ =వంశీబతీఎవం అంతర్జాతీయ వార్తలు ఆంధ్రప్రదేశ్ వార్తలు ెూశ్రీంశీ =ఋుం - భగవత్ 'సామరస్య' స్వరం ఇదే సూత్రం భూటాన్‌కూ వర్తిస్తుంది. భూటాన్ భారత్‌కు స్నేహపూర్వక పొరుగు దేశం. మన దేశానికి ముఖ్యమైన భాగస్వామి కూడా. ఆ దేశ జలవిద్యుత్ రంగం భారత్‌తో సన్నిహితంగా అనుసంధానమై ఉంది. అయితే స్నేహబంధం జలప్రవాహాల వల్ల తలెత్తే ప్రమాదాలను తొలగించలేదు. భూటాన్ నుంచి దిగువకు ప్రవహించే నదులు నేరుగా దిగువ అసోంపై ప్రభావం చూపుతాయి. ఎగువ ప్రాంతాలనుంచి నీటిని విడుదల చేసిన తర్వాత నీటిమట్టాలు వేగంగా పెరిగితే.. దిగువ ప్రాంతాల్లో ఎంత త్వరగా ఆందోళన తలెత్తుతుందో ఇటీవలి పరిణామాలు చూపించాయి. 2026 ఆగస్టులో బొంగైగావ్, చిరాంగ్ జిల్లాల అధికారులు అప్రమత్తత హెచ్చరికలు జారీ చేశారు.



### కుటుంబంలో పెరిగిన గౌరవం

### ఇప్పటి వరకూ రూ. 75 వేల 503 కోట్ల పెన్షన్లు ఇచ్చాం

### వీటితో మూడు పోలవరాలు కట్టగలం

### మంచి కోసం సూచనలు,సలహాలు స్వీకరిస్తా


### అభివృద్ధిని అడ్డుకుంటున్న గొడ్డలిపార్టీ

### మీ దీవెనలు ఇలాగే ఉంటే ఇంకా అభివృద్ధి చేస్తా

### మొగల్తూరు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో చంద్రబాబు

**భీమవరం,**

పెన్షన్లతో పేద కుటుంబాల్లో భరోసా నింపామని సిఎం చంద్రబాబు అన్నారు. ఇప్పుడు ఆయా కుటుంబాల్లో పెద్దలకు గౌరవం దక్కుతోందన్నారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించడానికి డ్వాక్రా సంఘాలను స్థాపించామని సీఎం తెలిపారు. తన తల్లికి వచ్చిన కష్టం ఎవరికీ రాకూడదని దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. ప్రస్తుతం మగవారితో సమానంగా ఆడవారు ఎదిగారని అన్నారు. భవిష్యత్తులో మగవారిని మించిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదని చెప్పుకొచ్చారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు ఇస్తూ ఆదుకుంటున్నామన్నారు. దేశంలో నాలుగు వేలు, ఆరువేలు, పదివేలు, పదిహేను వేలు పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం ఏపీనే అని అన్నారు. ఇప్పటి వరకూ 75 వేల 503 కోట్ల రూపాయలను పెన్షన్లు ఇచ్చామని.. ఆ డబ్బుతో మూడు పోలవరం ప్రాజెక్ట్‌లు కట్టవచ్చన్నారు. ఆర్థిక అసమానతలు పోవాలని.. అందరికీ సంక్షేమం అందాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. 45 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎన్నోసార్లు నరసాపురం వచ్చానని..అనేక పాలనా సంస్కరణలకు నాంది పలికామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మొగల్తూరులో లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేసిన అనంతరం ప్రజావేదిక సభలో సీఎం మాట్లాడుతూ.. తనకు మొగల్తూరు కొత్తేమీ కాదన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఉపసభాపతి రఘురామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రజా కార్యక్రమాల్లో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కోలుకోలేని విధ్వంసం జరిగిందని విమర్శించారు. అటువంటి పరిస్థితి నుంచి 94 శాతం సీట్లలో, 54 శాతం ఓట్లతో కూటమిని ప్రజలు గెలిపించారని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ఇంకా బాగా జరగాలి.. అందుకోసం సలహాలు, సూచనలు చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సంక్షేమం పేదవాడిని నిలబెట్టాలి.. తాత్కాలిక ఉపశమనం ఉండాలన్నారు. చైనా సామెతను ఉదాహరిస్తూ..చేపలు అందించడం కాదు..చేపలు పట్టించడం నేర్పాలని అన్నారు. ప్రతి ఒక్కరూ స్వయం సమృద్ధి సాధించాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. ఆడ బిడ్డలు ఎక్కడికి వెళ్లాలన్నా.. ఉచిత బస్సులు తెచ్చాం. దీపం పథకం ద్వారా 3 సిలిండర్లు ఇస్తున్నాం. పేదల సేవ కోసమే మొగల్తూరు వచ్చాను. సీఎం స్థాయిలో అనేక మార్పులు చేశాను. ఎంత సేవ చేసినా మీ రుణం తీర్చుకోలేను. అనేక సంస్కరణలకు నాంది పలికాం.. ప్రజా చైతన్య కార్యక్రమాలు తెచ్చాం. ఎన్నికల్లో మీరిచ్చిన తీర్పును ఎన్నటికీ మర్చిపోలేను. వైకాపా హయాంలో రాష్ట్రానికి కోలుకోలేని నష్టం జరిగింది. కూటమిగా ఏర్పడి రాష్ట్రాన్ని మళ్లీ




గాడిన పెడుతున్నాం. 45 సంవత్సరాలుగా వెనుకబడిన వర్గాలు తెదేపాని అంటిపెట్టుకునే ఉన్నాయి. ఆర్టీసీలో మహిళా కండక్టర్ల వ్యవస్థను తీసుకొచ్చాం. త్వరలో మహిళా డ్రైవర్ల వ్యవస్థను తీసుకొస్తాం. వడ్డెర సమాజిక వర్గానికి మైనింగ్ లీజులు పెట్టాం. గౌడ్ కులానికి మద్యంషాపులు కేటాయిస్తున్నాం. డీఎస్సీపై వైకాపా 350 కేసులు వేసింది. వైకాపా చేస్తోన్న ప్రచారాన్ని డీఎస్సీ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పింఛన్లు పెంచాం. పేదల పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. పేదలకు చేయూతనిస్తే ఏదైనా సాధించే సత్తా ఉంటుందని చంద్రబాబు అన్నారు. కొన్ని రోజుల్లో ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయని.. వాటిని మహిళలు నడపాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. డ్వాక్రా ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అయ్యేలా చూస్తామని చెప్పారు. మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఆర్థిక సహాయాన్ని ఇవ్వడాన్ని తానే ప్రారంభించానని తెలిపారు. ఎలాంటి మంచి పనులు చేసినా అడ్డుపడుతున్నారని ప్రతిపక్షంపై మండిపడ్డారు. ఏజెన్సీలోని పిల్లలకు మెరుగైన విద్య అందిస్తే, ప్రపంచంలోనే మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు. వాటన్నింటికీ గొడ్డలి పార్టీ అడ్డుపడుతోందని విమర్శించారు. 'ఎంత అడ్డుపడినా నా ఆశయాన్ని ఆపలేరు' అని స్పష్టం చేశారు. డీఎస్సీని అడ్డుకోవడానికి 350 పిటిషన్లు వేశారని.. పారదర్శకంగా ఉద్యోగాలు ఇస్తే, కోడిగుడ్డుకు ఈకలు పీకుతున్నట్లు వ్యవహరిస్తున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీలో టీచర్లుగా ఎంపికైన వారు గొడ్డలి పార్టీని హెచ్చరించినా వారిలో మార్పులేదన్నారు. త్వరలో ఏసీ బస్సులు వస్తున్నాయని.. మహిళలు ఉచితంగా ఆ బస్సుల్లో ఎక్కే రోజులు రాబోతున్నాయని తెలిపారు. మహిళలు ఇంటిపైన సోలార్ పెట్టుకుంటే విద్యుత్ తయారు అవుతుందని.. దానివలన కొన్ని రోజుల్లో ఉచితంగా కరెంటు పొందవచ్చని సూచించారు. వేసవికాలంలో ఎండలు ఎక్కువ ఉంటాయి కాబట్టి.. ఏసీలు పెట్టుకోవచ్చని.. అదనంగా ఉండే విద్యుత్‌ను అమ్ముకోవచ్చన్నారు. ప్రతి ఇంట్లో ఒక చిన్న పారిశ్రామికవేత్త రావాలని వన్ హౌస్- వన్ ఆంతప్రెన్యూర్ అనే పథకాన్ని తీసుకువచ్చినట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. అందరూ ప్రయత్నం చేస్తే మార్పు ఖచ్చితంగా వస్తుందని.. అనుకుంటే సాధించగలుగుతారని చంద్రబాబు అన్నారు. ఇప్పటికే 5 లక్షల 90 వేలు ఇళ్లు పూర్తి చేశామని.. మరో అయిదు లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. అప్పట్లో పరిశ్రమలను పారద్రోలారని.. కూటమి అధికారంలోకి వచ్చాక 22 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. బుధవారం గోదావరి నీటిని ఉత్తరాంధ్రకు తీసుకెళ్లబోతున్నామని.. చరిత్రను మార్చబోతున్నామని తెలిపారు. భవిష్యత్తులో గోదావరి, కృష్ణా, కావేరి నదులను అనుసంధానం చేస్తామని వెల్లడించారు. మూడేళ్లుగా కరెంటు ఛార్జీలు పెంచలేదని, తగ్గించామని సీఎం అన్నారు. వైసీపీ హయాంలో 9 సార్లు 32 వేల కోట్ల రూపాయల మేర ఛార్జీలు పెంచారని చెప్పారు. లక్షా 50 వేల కోట్లు విద్యుత్ నిమిత్తం అప్పులు చేశారని వివరించారు. రెండు రూపాయలకు కిలో బియ్యం ఇచ్చి పేదలను ఆదుకున్న యుగపురుషుడు ఎన్టీఆర్ అని గుర్తుచేశారు. యూనిట్ రూపాయిన్నరకే ఆక్వాకు కరెంటు ఇస్తూ.. రూ.1200 కోట్లు సబ్సిడీ ఇస్తున్నామని అన్నారు. కేరళంలో ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనునిత్యం ప్రజల గురించే ఆలోచిస్తున్నారని తెలిపారు. గొడ్డలి పార్టీకి వణుకు పుట్టిందని.. స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవం అయితే ఊరుకోమని అంటున్నారని చంద్రబాబు తెలిపారు. ప్రజలు ఏకగ్రీవం చేస్తే వారేం చేస్తారని ప్రశ్నించారు. ఆయారాం, గయారాంలకు చెక్ పెట్టేందుకే మున్సిపల్ ఎన్నికల్లో ప్రత్యక్ష ఎన్నికలను తీసుకువచ్చామన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు తీసుకువస్తే, మళ్లీ గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లిందని.. చిత్తుచిత్తుగా ఓడిపోతామనే భయంతో సర్ పేరుతో మళ్లీ కోర్టుకు వెళ్లారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉంటే చాలదని.. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఉండాలని అన్నారు. సమాజంలో కలుషితం పోవాలని తెలిపారు. జనవరి నుంచి సంజీవని పథకాన్ని తీసుకొస్తున్నామని.. అప్పుడు డాక్టర్లే ప్రజల దగ్గరకు వస్తారన్నారు. 'రాబోయే రోజుల్లో మీ ఫోనే మీకు సర్వస్వం. ఏ పని చేయాలన్నా ఫోన్ ద్వారా చేయవచ్చు. మీ అందరూ ఆనందంగా ఉండడానికి ఏమైనా చేస్తాను. దానిని మీరు కూడా ఉపయోగించుకోవాలి. గొడ్డలి పార్టీ కులాలు, మతాల పేరుతో రెచ్చగొడుతోంది. ప్రజలు కూడా ఆలోచించుకోవాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## విజయసాయిపై చేయిచేసుకున్న సజ్జల

### మంగళగిరి ప్లీనర సందర్భంగా సజ్జల కొట్టారు

### నెల్లూరు ఎమ్మెల్యే కోటంరెడ్డి సంచలన వ్యాఖ్యలు

**నెల్లూరు,**

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అంటే సజ్జలకు గిట్టదని, ఓసారి చేయికూడా చేసుకున్నారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి.. విజయసాయిరెడ్డిని కొట్టింది నిజమేనని తెలిపారు. మంగళగిరిలో ప్లీనరీ జరిగేటప్పుడు రెస్ట్ రూమ్‌లో వేదికపై ఎవరితో మాట్లాడించాలనే విషయంపై వీరిద్దరి మధ్య వివాదం తలెత్తి, మాటామాటా పెరిగి కొట్టింది వాస్తవమేనని చెప్పుకొచ్చారు. ఆ విషయం చాలామంది నేతలకు తెలుసునని అన్నారు. విజయసాయికి వైసీపీలో 72 అవమానాలు జరిగాయని చెప్పారు. ఆయన నెల్లూరు లోక్‌సభ నుంచి పోటీ చేసినప్పుడు ఎంత నీచంగా, ఘోరంగా మాట్లాడారో అందరికీ తెలుసునని పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరులో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు ఒక్కడికే తెలిసి మరో ఘోర అవమానం జరిగిందని అన్నారు. విజయసాయి తన సొంతూరైన తాళ్లపూడికి వచ్చినప్పుడు, కాకుపల్లి సెంటర్‌లో వంద వాహనాలతో ఘనంగా స్వాగతం పలికారని వెల్లడించారు. దానిపై విజయసాయిని సజ్జల దారుణంగా దూషించారని చెప్పుకొచ్చారు. ఆ మాటలు చెప్పలేని విధంగా ఉన్నాయని అన్నారు. 'నేను చాలా పెద్ద తప్పు చేశానని సజ్జల అన్నారు. అమరావతి రైతులు వరదలు, భారీ వర్షాల్లో ఇబ్బందులు పడుతుంటే నేను మాట్లాడాను. నెల్లూరు రూరల్ నియోజకవర్గం దాటేంత వరకు ఏ ఇబ్బంది వచ్చినా నేను అండగా ఉంటానని చెప్పా. అప్పుడూ సజ్జల... నన్ను చాలా పెద్ద తప్పు చేశావన్నారు. ఇలాంటి మాటలు నాతో మాట్లాడొద్దని.. ఆ తప్పు చేసింది.. నువ్వా, నేనా..? అని సజ్జలను ఎదిరించి మాట్లాడాను. మా ఊరిలో విజయసాయి మీటింగ్ పెట్టి నన్ను ఎలా పడితే అలా తిట్టాడు. ఆయనంటే నాకు మంచి అభిప్రాయం లేదు' అని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. 'వైసీపీ హయాంలోని ఐదేళ్లు ప్రజావ్యతిరేక పాలన సాగించింది. దేశవిదేశాల నుంచి ఆంధ్రులు వచ్చి ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు వేసి కూటమిని గెలిపించారు. కూటమి ప్రభుత్వ ఘనవిజయం ఓ చరిత్ర అయితే, వైసీపీ ఘోర పరాజయం కూడా చారిత్రక ఘట్టం. ఎందుకు ఓడిపోయామనే ఆలోచన లేకుండా... వైసీపీ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ వికృత రాజకీయం చేస్తుంది. వైసీపీ నేతలు అబద్దాలు చెబుతున్నారు. హిందూ మతానికి ఘోర అన్యాయం జరిగిందని వైసీపీ నేతలు ఎలా మాట్లాడుతున్నారో అర్థం కావట్లేదు. ఆలయాల్లో రథాలు తగులపడినప్పుడు, విగ్రహాల తలలు తెగ్గొట్టినప్పుడు, సింహాల విగ్రహాలు చోరీకి గురైనప్పుడు మీ నోళ్లు ఏమయ్యాయి. తిరుపతి వేంకటేశ్వర ఛానెల్‌ను కూడా రాజకీయాలకు వాడుకున్నారు. వైసీపీ మాజీ మంత్రిపై ఆయన కోడలు. సంచలన ఆరోపణలు చేశారు. ఆమె పెళ్లి అయినప్పుడు హిందువులమని మాజీ మంత్రి చెప్పారని... పెళ్లి అయ్యాక హిందు దేవుళ్లని పూజిస్తే కొట్టారని ఆమె చెప్పింది. జగన్, వైసీపీ నేతలు, సాక్షి మీడియా ఎందుకు ఈ విషయంపై స్పందించట్లేదు. ఏపీని అస్థిరపరచాలని ఓ భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు రాకూడదని ఫేక్ వీడియోలతో ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకోం. వైసీపీ క్రెడిట్ చోరీ చూస్తుంటే... నాగార్జునసాగర్, సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్టులు కట్టింది జగనే అని చెప్పేటట్లుగా ఉన్నారు. ఇంకా ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కూడా జగనే అని చెప్పేటట్లుగా ఉన్నారు' అని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు.

## కెసిఆర్‌కు ఎదురుగా వచ్చే దమ్ముందా?

### కెసిఆర్ అంటే అనుక్షణం భయంతో చస్తున్న రేవంత్

### ఆంధ్రాకు నీరు తరలిస్తున్నా అడ్డుకోని అసమర్థ సిఎం

### మీడియా సమావేశంలో మండిపడ్డ జగదీశ్ రెడ్డి

### మిర్యాలగూడ సభ నిర్వహించి తీరుతామని వెల్లడి

**సూర్యాపేట,**

రాష్ట్రంలో నీటి సమస్యలు తీవ్రంగా మారుతున్నా ప్రభుత్వ పెద్దలు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అవినీతి సొమ్మును లెక్కించే పనిలో ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆరోపించారు. సూర్యాపేటలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు ఆయన వ్యక్తిత్వానికి అద్దం పడుతున్నాయని జగదీశ్ రెడ్డి అన్నారు. కేసీఆర్ అంటే అనుక్షణం భయంతోనే రేవంత్ రెడ్డి రోత మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను ఎక్కువగా గుర్తు చేసుకునే వారిలో రేవంత్ రెడ్డిదే ప్రథమ స్థానమని ఎద్దేవా చేశారు. 'కేసీఆర్‌కు ఎదురుగా వచ్చే దమ్ము నీకుందా?' అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డి సచివాలయానికి ఎన్నిసార్లు వచ్చారో లెక్కలు తీయడానికి సిద్ధమా? అని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. వెలిగొండ ప్రాజెక్టుపై మాట్లాడే దమ్ము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎందుకు లేదని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. కళ్లముందే నీరు కనిపిస్తున్నా ఆ నీటిని ఆంధ్రా ప్రాంతానికి తరలిస్తుంటే అడ్డుకోలేని పరిస్థితికి ప్రభుత్వ అసమర్థత, అవినీతే కారణమని ఆరోపించారు. తనకు రాజకీయంగా ఎదగడానికి అవకాశం కల్పించిన మహబూబ్‌నగర్ జిల్లాకు రేవంత్ రెడ్డి ద్రోహం చేస్తున్నారని జగదీశ్ రెడ్డి విమర్శించారు. పాలమూరు ప్రాంతంలో మళ్లీ వలసలు పెరగడానికి ప్రభుత్వ విధానాలే కారణమవుతున్నాయని ఆరోపించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అన్యాయం జరుగుతున్నా జిల్లా మంత్రులు నోరు మెదపడం లేదని ఆయన మండిపడ్డారు. కళ్ల ముందే నీటి సమస్యలు కనిపిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలోని అనేక పట్టణాలు, పల్లెల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని జగదీశ్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 24 గంటల విద్యుత్, తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టామని, ప్రస్తుత ప్రభుత్వం కరెంట్, నీరు అందించడంలో విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, వైఫల్యాలపై రేపటి నుంచి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరుబాట ప్రారంభమవుతుందని జగదీశ్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యంగా రైతాంగ సమస్యలు, వ్యవసాయ సంక్షోభంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. ల్గ÷తాంగ సమస్యలు, వ్యవసాయ సంక్షోభంపై కేటీఆర్ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో భారీ రైతు సభ నిర్వహించనున్నట్లు జగదీశ్ రెడ్డి తెలిపారు. ఈ సభకు రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడానికి సిద్ధమవుతున్నారని చెప్పారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా మిర్యాలగూడలో కేటీఆర్ రైతు సభను నిర్వహించి తీరుతామని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

# ఎస్ఐఆర్-2026 నోటీసుల హియరింగ్ పకడ్బందీగా నిర్వహించాలి: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి



రంగారెడ్డి జిల్లా పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026) నోటీసుల హియరింగ్ మరియు పరిష్కార ప్రక్రియను నిబంధనల మేరకు అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని బండ్లగూడ, హైదర్‌షాకోట్, శివరాంపల్లి ప్రాంతాలలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణ రెడ్డితో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఓటర్లు సమర్పిస్తున్న పత్రాలు, రికార్డుల పరిశీలన మరియు ధృవీకరణ తీరును స్వయంగా తనిఖీ చేశారు.అనంతరం ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో సీఈఓ మాట్లాడుతూ.. జిల్లాలో 'నో మ్యాపింగ్' మరియు 'అనామలీస్' కేటగిరీలకు సంబంధించిన దరఖాస్తులు, రికార్డుల ధృవీకరణలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించవద్దని స్పష్టం చేశారు. హియరింగ్‌కు హాజరయ్యే వ్యక్తుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సరైన ఆధారాలు సమర్పించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు తగినంత మంది సిబ్బందిని నియమించుకోవాలని, రోజువారీ లక్ష్యాలు, ప్రామాణిక కార్యాచరణ విధానాలతో సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణ రెడ్డి శేరిలింగంపల్లి జోన్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్ హియరింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. దరఖాస్తుల పరిష్కారం, ప్రజల అభ్యంతరాల స్వీకరణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, సంబంధిత ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## మైనారిటీ మహిళల ఆర్థిక సాధికారతకే ప్రభుత్వ ప్రాధాన్యం: మంత్రి మహ్మద్ అజహరుద్దీన్



రాష్ట్రంలో మైనారిటీ మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలంగాణ రాష్ట్ర మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ స్పష్టం చేశారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలో తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీఎంఎఫ్‌సీ) చైర్మన్ మొహమ్మద్ ఒబేదుల్లా కొత్వాల్‌తో కలిసి ఆయన మైనారిటీ లబ్ధిదారులకు ఆర్థిక సాయం, జీవనోపాధి ప్రోత్సాహకాలను అందజేశారు. 'ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన' పథకం కింద ఎంపికైన 278 మంది మైనారిటీ వితంతు మహిళలకు ఒక్కొక్కరికి రూ. 50,000 చొప్పున ఆర్థిక సాయం చెక్కులను మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ పంపిణీ చేశారు. అలాగే 'తుర్క కాశా పునరావాసం' పథకంలో భాగంగా 13 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కటి రూ. 60,000 విలువైన జనరేటర్ మరియు టూల్ కిట్లను స్వయం ఉపాధి నిమిత్తం అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగారెడ్డి జిల్లాలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, మహిళలు వీటిని సద్వినియోగం చేసుకొని సొంత కాళ్లపై నిలబడాలని పిలుపునిచ్చారు. కేవలం సాయం అందించడమే కాకుండా, మహిళలకు సరైన నైపుణ్యాలు నేర్పించి స్వయం సమృద్ధి సాధించేలా చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మైనారిటీల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, మదీనా బస్సు ప్రమాద బాధితులకు తక్షణ పరిహారం అందించడం, హజ్ ఏర్పాట్లకు రూ. 7 కోట్లు కేటాయించడమే ఇందుకు నిదర్శనమని గుర్తుచేశారు. నిధుల కేటాయింపులో నాయకుల వినతులపై తాను వెనుకాడబోనని, టెస్ట్ క్రికెటర్‌గా అభివృద్ధి పనుల్లోనూ సెంచరీ కొడతానని చమత్కరించారు. అలాగే పాతబస్తీలోని యువత చదువు, నైపుణ్యాభివృద్ధి వైపు దృష్టి సారించేలా కమ్యూనిటీ పెద్దలు సరైన మార్గనిర్దేశం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీమతి కిరణ్మయి, ఐఏఎస్, టీజీఎంఎఫ్‌సీ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చిన్ననాటి నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవర్చాలి: ఐసీఎంఆర్--ఎన్ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ భారతి కులకర్ణి



చిన్నప్పటి నుంచే పిల్లల్లో ఆరోగ్యకరమైన పోషకాహార అలవాట్లను పెంపొందించడం అత్యంత ఆవశ్యకమని ఐసీఎంఆర్--నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) డైరెక్టర్ డాక్టర్ భారతి కులకర్ణి స్పష్టం చేశారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రెస్ టూర్‌లో భాగంగా ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన 15 మంది పాత్రికేయుల ప్రతినిధి బృందం బుధవారం నగరంలోని ఎన్ఐఎన్ కేంద్రాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా ఆహార పరిశోధనలు, ప్రజారోగ్య పరిరక్షణ, జాతీయ పోషకాహార విధానాల రూపకల్పనలో సంస్థ పోషిస్తున్న పాత్రపై మీడియాతో ఆమె మాట్లాడారు.దేశీయ ఆహార పదార్థాల పోషక విలువల సమగ్ర సమాచారంతో కూడిన 'ఇండియన్ ఫుడ్ కంపోజిషన్ టేబుల్స్', వివిధ వయసుల వారికి అవసరమైన ప్రమాణాలను నిర్దేశించే 'ఆర్డీఏ' మార్గదర్శకాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఎంతో కీలకమని డాక్టర్ కులకర్ణి పేర్కొన్నారు. జాతీయ ఆహార మార్గదర్శకాల ప్రకారం రెండేళ్ల లోపు చిన్నారుల ఆహారంలో చక్కెరను పూర్తిగా నివారించాలని సూచించారు. శారీరక శ్రమ లోపించడం, కొవ్వు, ఉప్పు, పంచదార అధికంగా ఉండే జంక్ ఫుడ్ వినియోగం వల్ల పిల్లల్లో స్థూలకాయం పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఆహారం లభించడమే కాకుండా పోషకాహార భద్రత సాధ్యం కావాలంటే ఆహారంలో వైవిధ్యం, జీవనశైలి మార్పులు అవసరమని స్పష్టం చేశారు. అలాగే ఉత్తరాఖండ్‌కు చెందిన సంప్రదాయ పంటలు, చిరుధాన్యాలైన మండువా, ఝుంగోరా, చోలై, కొడాల పోషక విలువలపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని, రక్తహీనత నివారణలో రాగుల ప్రభావంపై ప్రత్యేక అధ్యయనాలు కొనసాగుతున్నాయని వివరించారు.అనంతరం ఎన్ఐఎన్ సైంటిస్ట్--జి, నిచే విభాగ అధిపతి డాక్టర్ సుబ్బారావు ఎం. గవరవరపు పోషకాహార సమాచార వ్యాప్తిపై సాంకేతిక సదస్సు నిర్వహించారు. శాస్త్రీయమైన పోషకాహార వాస్తవాలను ప్రజలకు చేరవేయడంలోనూ, ఆహార రంగంలోని అపోహలను తొలగించడంలోనూ మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.అనంతరం ప్రతినిధి బృందం ఎన్ఐఎన్‌లోని అత్యాధునిక ప్రయోగశాలలను పరిశీలించి శాస్త్రవేత్తలతో ముచ్చటించింది. పర్యటనలో భాగంగా పాత్రికేయులు నగరంలోని చారిత్రక సాలార్ జంగ్ మ్యూజియాన్ని కూడా సందర్శించారు.

## నన్ను ఎవరూ రాజీనామా అడగలేదు: మంత్రి కొండా సురేఖ

పార్టీ పెద్దలకు తాను చెప్పాల్సిన విషయాలన్నీ స్పష్టంగా వివరించానని, ఇక కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకునే నిర్ణయం కోసం వేచి చూస్తున్నానని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.బుధవారం న్యూఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ఆమె భేటీ అయ్యారు.అనంతరం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన సురేఖ, తనను ఇంతవరకు ఎవరూ రాజీనామా చేయాలని కోరలేదని స్పష్టతనిచ్చారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై ఇప్పటికే కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు లిఖితపూర్వకంగా అన్ని అంశాలను తెలియజేశానని వెల్లడించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అపాయింట్‌మెంట్ లభించకపోవడంతో తన వివరణనంతా ఆయనకు వాట్సాప్ ద్వారా పంపినట్లు





తెలిపారు.ఇటీవల తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని సురేఖ తేల్చిచెప్పారు. సుస్మిత వివాహిత అని, ఒక స్వతంత్ర మహిళగా ఆమె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం ఏమాత్రం సరికాదన్నారు. ఆ వ్యాఖ్యలను తాను సమర్థించడం గానీ, ఖండించడం గానీ చేయబోనని స్పష్టం చేశారు. మంత్రివర్గంలో ఇతర సామాజిక వర్గాల నేతలపై తీవ్ర ఆరోపణలు ఉన్నప్పుడు రాని చర్యల ప్రస్తావన, కేవలం బీసీ వర్గానికి చెందిన తనపైనే ఎందుకు వస్తోందని ప్రశ్నించారు.రాష్ట్రంలో 60 శాతానికి పైగా ఉన్న బీసీ సామాజిక వర్గానికి చెందిన తనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవని, మంత్రిగా తన పనితీరు బాగుందని అధిష్ఠానానికి వివరించినట్లు పేర్కొన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా తనను పదవిలో కొనసాగించాలని కోరానని తెలిపారు. పార్టీలో కొందరి వెనుక ఉండి తనపై కావాలనే మాట్లాడిస్తున్నారని ఆరోపిస్తూ, ఒక మహిళా మంత్రిపై మాట్లాడిన నేతలకు కూడా షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.కాగా, గీసుకొండలో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిలను ఉద్దేశించి మంత్రి కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. దీనిపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ మంత్రి సురేఖకు నోటీసు ఇవ్వడం, ఆమె వివరణ సమర్పించడం చకచకా జరిగిపోయాయి. అనంతరం క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి సమగ్ర నివేదికను పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ద్వారా హైకమాండ్‌కు పంపించారు. మంత్రి పదవి నుంచి సురేఖను తప్పించాలనే సిఫార్సులతో కూడిన నివేదికను ఏఐసీసీ పరిశీలిస్తున్న తరుణంలో, సురేఖ స్వయంగా ఢిల్లీకి వెళ్లి అధిష్ఠాన పెద్దలను కలవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

## కేటీఆర్ హద్దుమీరి మాట్లాడితే ప్రజలు క్షమించరు: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి





రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లలా ముందుకు సాగుతున్నాయని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి వెళ్లినప్పటికీ, తీవ్ర ఆర్థిక సంక్షోభంలోనూ పేదలకు సంక్షేమ ఫలాలను విజయవంతంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. వరుస ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినా బీఆర్ఎస్ నాయకులకు ఇంకా జ్ఞానోదయం కాలేదని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై కేటీఆర్ సంస్కారహీనంగా మాట్లాడారని మండిపడ్డారు. కేటీఆర్ హద్దులు మీరి మాట్లాడితే ప్రజలు ఎంతమాత్రం క్షమించే ప్రసక్తే లేదని హెచ్చరించారు.గత పాలకులు 'వరి వేస్తే ఉరి' అన్న దుస్థితి నుంచి నేడు రైతులను రాజులను చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేసిందని మంత్రి తెలిపారు. రైతులకు ఇప్పటివరకు రూ. 1.74 లక్షల కోట్లు అందించామని, వరికి బోనస్ ప్రకటిస్తూ సాగులో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపామని వివరించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల లోపే 15 లక్షల కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసిందని గుర్తుచేశారు. త్వరలోనే మరో 3 లక్షల మందికి పింఛన్లు అందజేయనున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం నగరానికి 30-40 కిలోమీటర్ల దూరంలో నిర్మానుష్య ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టి చేతులు దులుపుకుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం నగర నడిబొడ్డున ఖరీదైన స్థలాల్లో 'ఇందిరమ్మ టవర్లు' నిర్మిస్తోందని స్పష్టం చేశారు.ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాలను, సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం 'భూభారతి' పోర్టల్‌ను తీసుకొచ్చిందని, 22ఏ నిబంధనల పేరుతో అసలైన లబ్ధిదారులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. గత పాలకులు ఓఆర్ఆర్‌ల పేరుతో హైదరాబాద్ విలువైన భూములను అనుచరులకు, ఇతర రాష్ట్రాల వారికి కట్టబెట్టారని ఆరోపించారు.కేసీఆర్, హరీశ్‌రావు కుటుంబాలు తొమ్మిదేళ్లలో వేల కోట్ల రూపాయలను ఎలా సంపాదించాయో చెప్పాలని, దేశంలో ఏ రాజకీయ పార్టీ వద్ద లేనంత సొమ్ము బీఆర్ఎస్ ఖాతాల్లో ఎలా చేరిందో ప్రజలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో కొనసాగే నైతిక హక్కు కేసీఆర్‌కు ఏమాత్రం లేదని మంత్రి తేల్చిచెప్పారు. వెయ్యి రోజుల కాలంలో కేసీఆర్ ప్రజల సొమ్ము సుమారు రూ. 22 కోట్లను జీతభత్యాల రూపంలో పొందినప్పటికీ, ఏనాడూ ప్రజా సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడలేదని ధ్వజమెత్తారు. ప్రజల కోసం మాట్లాడని వ్యక్తికి ప్రతిపక్ష నేత హోదా అనవసరమని, ఇప్పటికైనా ఆయన తన ఎమ్మెల్యే పదవికి, ప్రతిపక్ష నేత హోదాకు రాజీనామా చేసి గౌరవం నిలబెట్టుకోవాలని మంత్రి పొంగులేటి హితవు పలికారు.

## సెప్టెంబర్ 5, 6 తేదీలలో ఎస్ఐఆర్ మెగా హియరింగ్

**నోటీసులు అందుకున్నవారు తప్పక హాజరు కావాలి: కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

రంగారెడ్డి జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా సెప్టెంబర్ 5, 6 తేదీలలో మెగా హియరింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే నోటీసులు జారీ చేయబడిన ఓటర్లు, ఆ నోటీసులో పేర్కొన్న తేదీ, సమయం ప్రకారం సంబంధిత హియరింగ్ కేంద్రానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన స్పష్టం చేశారు.హియరింగ్‌లో పాల్గొని తమకు సంబంధించిన అభ్యంతరాలు, వివరణలు, వాదనలను సంబంధిత అధికారుల ముందు సమర్పించుకోవాలని సూచించారు.హియరింగ్‌కు హాజరయ్యే వ్యక్తులు తమ వాదనను ధృవీకరించుకునేందుకు అవసరమైన ఆధార పత్రాలను వెంట తీసుకురావాల్సి ఉంటుంది.

# విద్యాశాఖ బాహ్య మూల్యాంకన నిర్ణయానికి తల్లిదండ్రుల హర్షం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు విద్యాశాఖ ప్రవేశపెట్టిన బాహ్య మూల్యాంకన విధానాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు ముక్తకంఠంతో స్వాగతిస్తున్నారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-1, ఎస్ఏ-2) పరీక్ష పత్రాలను మండల వనరుల కేంద్రాల్లో (ఎంఆర్‌సీ) ఇతర పాఠశాలల ఉపాధ్యాయులతో మూల్యాంకనం చేయించాలన్న ప్రభుత్వ నిర్ణయం సర్కారు విద్యా వ్యవస్థలో సరికొత్త మార్పునకు నాంది పలుకుతుందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల విద్యలో పూర్తి పారదర్శకత, పక్కా జవాబుదారీతనం తీసుకురావడానికి ప్రభుత్వం చేపట్టిన ఈ నిర్ణయాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ వెనక్కి తీసుకోవద్దని, ఇలాంటి విద్యా సంస్కరణలను మరింత వేగవంతం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఇన్నాళ్లూ పటిష్టమైన పర్యవేక్షణ లేకపోవడంతో సర్కారు బడుల్లో బోధన గాడి తప్పిందని, అడిగేవారు లేరన్న చందంగా మారిన విద్యా వ్యవస్థకు ఈ సరికొత్త విధానం ఒక గొప్ప దిద్దుబాటు చర్యగా నిలుస్తుందని తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు. సొంత పాఠశాలల్లోనే పరీక్ష పత్రాలు దిద్దే విధానం వల్ల విద్యార్థుల అసలు సామర్థ్యాలు వెలుగులోకి రాకుండా పోయాయని, సక్రమమైన మూల్యాంకనం లేక విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాహ్య మూల్యాంకనం అమలైతేనే విద్యార్థి నిజమైన ప్రతిభ, అభ్యసన లోపాలు స్పష్టంగా బయటపడతాయని పేర్కొంటున్నారు. వ్యవస్థలో జవాబుదారీతనం ఉన్నప్పుడే ఉపాధ్యాయులు సైతం పూర్తి బాధ్యతతో పాఠాలు బోధిస్తారని, ఇది విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని వారు గట్టిగా నమ్ముతున్నారు. ఉపాధ్యాయ సంఘాలు సంస్కరణలను వ్యతిరేకించడం సరికాదని, వారి ఒత్తిళ్లకు ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ తలొగ్గవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తు కంటే ఎవరి వ్యక్తిగత ప్రయోజనాలూ ముఖ్యం కాదని, బోధనలో నాణ్యత పెంచేందుకు ప్రభుత్వం తీసుకునే ప్రతి మంచి నిర్ణయానికి తాము సంపూర్ణ మద్దతుగా ఉంటామని స్పష్టం చేశారు. విద్యాశాఖ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ బడుల్లో చదివే పేద విద్యార్థుల భవిష్యత్తు కచ్చితంగా మారుతుందన్న బలమైన నమ్మకం ఏర్పడిందని, తక్షణమే ఈ బాహ్య మూల్యాంకన విధానాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,